www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129

TELANGANA RISING
CURE - PURE - RARE

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:37 TUESDAY ,JUNE 16,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 37 మంగళవారం 16 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని



హంస కలం వార్త జూన్ 15

సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి పిల్లలను కాపాడేందుకు యూకే ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి యూకేలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తాజాగా తెలిపారు. ఈ ఏడాది చివరి కల్లా ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి -మిగతా2లో

## చైనాకు చెక్.. అమెరికా, భారత్ క్రిటికల్ మినరల్స్ టాస్క్‌ఫోర్స్ సమావేశం



హంస కలం వార్త జూన్ 15

క్రిటికల్ మినరల్స్ మార్కెట్‌లో చైనా పై ఆధారపడటాన్ని, ఆధిపత్యాన్ని తగ్గించేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరో కీలక దశలోకి ప్రవేశించింది. అమెరికా–ఇండియా క్రిటికల్ మినిరల్స్ సెక్యూరిటీ టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశం గత వారంలో జరిగింది. రెండు దేశాలకు చెందిన 17 ప్రముఖ సంస్థలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. -మిగతా2లో

# మెట్రో విస్తరణను కిషన్ రెడ్డే అడ్డుకుంటున్నారు : సీఎం రేవంత్ రెడ్డి

- కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్ పై రేవంత్ విమర్శలు
- ఐఆర్ఎఫ్‌సీ రుణం నిలిపేశారన్న వాదన
- ఎన్ఓసీ ఇస్తే చాలన్న సీఎం
- బీజేపీ, బీఆర్ఎస్ పై ఘాటు వ్యాఖ్యలు
- హైదరాబాద్ పై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపణ



హంస కలం వార్త జూన్ 15

హైదరాబాద్ విస్తరణను అడ్డుకుంటుందని కేందమంత్రి జి. కిషన్ రెడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో టేకోవర్ కావాల్సిన ఐఆర్ఎఫ్‌సీ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంతా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. కానీ, కిషన్‌రెడ్డి తన సహచర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. రుణం మంజూర్ కాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. -మిగతా2లో

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక: డిప్యూటీ సీఎం భట్టి



- మ్యూజియం 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, డిప్యూటీ సీఎం
- మ్యూజియం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్న భట్టి విక్రమార్క
- ఈ నెల 21 వరకు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణ

2

## బాల్య వివాహాల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు.. తరుణి సంస్థతో ఎంఓయూ



హంస కలం వార్త జూన్ 15

తెలంగాణలో బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ – తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం మంత్రి సీతక్క సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. - మిగతా2లో

## దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు.. కిషన్‌రెడ్డి పై మోదీ ప్రశంసలు



హంస కలం వార్త జూన్ 15

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయన పై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పని చేసే నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న - మిగతా2లో

## కిడ్నీ మరణాల్లో తెలంగాణ టాప్.. ఐసీఎంఆర్ నివేదికలో షాకింగ్ నిజాలు!



హంస కలం వార్త జూన్ 15

తెలంగాణలో దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల కారణంగా సంభవిస్తున్న మరణాలు దేశంలోనే అత్యధికంగా ఉన్నాయని తాజా అధ్యయనం ఒకటి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కిడ్నీ వైఫల్యాల మరణాల రేటులో రాష్ట్రం అన్ని రాష్ట్రాలను మించి అగ్రస్థానంలో నిలవడం పరిస్థితి తీవ్రతకు అద్దం - మిగతా2లో

## ఇజ్రాయెల్‌తో ఒప్పందం పై నిరసన.. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ వాకౌట్



హంస కలం వార్త జూన్ 15

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ తాజాగా విద్యార్థుల నిరసనను ఎదుర్కోవాల్సి వచ్చింది. జూన్ 14న స్నాతకోత్సవానికి హాజరైన సుందర్ పిచాయ్ ప్రసంగిస్తుండగా స్టూడెంట్స్ అక్కడి నుంచి లేచి వెళ్లిపోయారు. ఇజ్రాయెల్‌తో గూగుల్ కుదుర్చుకున్న ఒప్పందానికి - మిగతా2లో

## ఏపీ, తెలంగాణలకు చల్లని కబురు: హైదరాబాద్‌ను తాకిన నైరుతి



2

- హైదరాబాద్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- మరో 4-5 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో పూర్తిస్థాయి విస్తరణ
- భద్రాద్రి కొత్తగూడెం, కళింగపట్నం వరకు చేరిన రుతుపవనాలు
- ముందుకు కదిలేందుకు అనుకూలంగా ఉన్న పరిస్థితులు

హంస కలం వార్త HAMSA KALAM VARTA
మంగళవారం 16 జూన్ 2026

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ నగర స్ఫూర్తికి, సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మ్యూజియం 75వ వార్షికోత్సవం, సాలార్‌జంగ్-III, 137వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విభిన్న సంస్కృతులు, విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సాలార్‌జంగ్ మ్యూజియం వివిధ సంస్కృతుల మధ్య సామరస్యానికి ప్రతీక అని, ఇది ఒక అపురూపమైన జాతీయ సంపద అని అభివర్ణించారు. జూన్ 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా మ్యూజియం విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సాలార్‌జంగ్-IIIగా ప్రసిద్ధి చెందిన మీర్ యూసుఫ్ అలీ ఖాన్ ఒక్కరే సేకరించిన అరుదైన కళాఖండాలతో ఈ మ్యూజియం ఏర్పాటైంది. 1951లో మూసీ నది ఒడ్డున ప్రారంభమైన ఈ మ్యూజియం, నేడు దేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## చైనాకు చెక్.. అమెరికా, భారత్ క్రిటికల్ మినరల్స్ టాస్క్‌ఫోర్స్ సమావేశం

ఖనిజాల ప్రాసెసింగ్, తయారీ, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడులు, సరఫరా గొలుసు బలోపేతంపై చర్చించాయి. గత నెలలో ఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మధ్య కీలక ఒప్పందం జరిగిన నేపథ్యంలో తాజా సమావేశం జరిగింది. సాంకేతికత, రక్షణ, స్వచ్ఛ ఇంధన రంగాలకు అత్యంత కీలకమైన అరుదైన ఖనిజాల సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి చారిత్రక వ్యూహాత్మక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై క్వాడ్ సమావేశంలో అమెరికా, భారత్ సంతకాలు చేశాయి. ఆ ప్రకారం కీలకమైన ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, మైనింగ్, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ ప్రక్రియల్లో ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. కొత్త ప్రాజెక్టులకు నిధుల సమీకరణలో పరస్పరం సహాయం చేసుకుంటాయి. ఇందుకోసం అమెరికా, భారత్ కలిసి క్రిటికల్ మినిరల్స్ సెక్యూరిటీ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. కాగా, టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశంలో ఐదు ప్రధాన రంగాలను గుర్తించారు. లిథియం శుద్ధి, బ్యాటరీల తయారీల్లో ఉపయోగించే కాథోడ్ పదార్థాలు ఉత్పత్తి, బ్రాటరీ గ్రేడ్ సింథటిక్ గ్రాఫైట్ తయారీ, రేర్ ఎర్త్ ప్రాసెసింగ్, మాగ్నెట్ తయారీ, ఖనిజాల రీసైక్లింగ్ ఉన్నాయి. ఈ రంగాల్లో సంయుక్త పెట్టుబడులు, సాంకేత భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని నిర్ణయించారు.

## వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని

వచ్చే ఏడాది మార్చి నాటికి అమల్లోకి తెస్తామని అన్నారు. ఆన్‌లైన్ ప్రపంచం తాలూకు చెడు ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడుకునేందుకు గట్టి రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 'పూర్తిస్థాయి నిషేధమే సబబని నాకు అనిపిస్తోంది. దీన్ని అమలు చేయడం చాలా కష్టం. కానీ టెక్ కంపెనీ ఒత్తిడిని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే' అని ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనల పూర్తిస్థాయి అమలుకు తాను సిద్ధమేనని పేర్కొన్నారు. పిల్లల భద్రత, ఆనందం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పిల్లలకు ఆన్‌లైన్ ప్రపంచం నుంచి రక్షణ కల్పించడమే ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబాల పక్షాన నిలవాల్సిన సమయం ఇదేనని అభిప్రాయపడ్డారు. యథాతథ స్థితితో ఎలాంటి ప్రయోజనం కలగట్లేదని తాము గుర్తించినట్టు చెప్పారు. ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఈ తరహా నిషేధం అమలవుతోంది. సోషల్ మీడియాపై ఆంక్షలకు ఇండోనేషియా కూడా సిద్ధమైంది. పిల్లల సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బ్రెజిల్‌లో ఇప్పటికే పలు రకాల ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పిల్లలకు సోషల్ మీడియా నిషేధానికి ఫ్రాన్స్ కూడా సిద్ధమైంది. తుర్కియే చర్యలు తుదిదశలో ఉన్నాయి. ఇతర పాశ్చాత్య దేశాలు కూడా ఇదే బాటలో అడుగులు వేస్తున్నాయి. అయితే, తాను తీసుకునే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని బ్రిటన్ ప్రధాని చెప్పారు. ఈ విషయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తామని అన్నారు.

## ఇజ్రాయెల్‌తో ఒప్పందం పై నిరసన.. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ వాకౌట్

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ తాజాగా ఇజ్రాయెల్‌తో గూగుల్ కుదుర్చుకున్న ఒప్పందానికి నిరసనగా విద్యార్థులు వాకౌట్ చేసినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ ప్రభుత్వం, మిలిటరీతో గూగుల్, అమెజాన్ సంస్థలు ప్రాజెక్టు నింబస్ పేరిట ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం, ఇజ్రాయెల్ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, మిలిటరీ డిజిటల్ వసతులను గూగుల్, అమెజాన్‌లు నిర్వహించే స్థానిక క్లౌడ్ నెట్‌వర్క్‌కు బదిలీ చేయనున్నారు. అయితే, గాజాలో మిలిటరీ ఆపరేషన్స్ కోసం ఇజ్రాయెల్ ఏఐ టూల్స్‌ను వాడుతోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో సుమారు 100 మంది విద్యార్థులు సీఈఓ సుందర్ పిచాయ్ ప్రసంగం సందర్భంగా వాకౌట్ చేశారు. పాలస్తీనాకు స్వేచ్ఛ కల్పించాలని నినాదాలు చేస్తూ వెళ్లిపోయారు. సుందర్ పిచాయ్ తన ప్రసంగంలో ఏఐ ప్రస్తావన తేకపోయినా విద్యార్థుల నిరసనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఏఐతో ఉపాధి అవకాశాలు తగ్గుతాయని అమెరికన్ యూనివర్సిటీల్లో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా అనేక యూనివర్సిటీల్లో టెక్ సంస్థల అధిపతులు, సీఈఓలు విద్యార్థుల నిరసనను ఎదుర్కోవాల్సి వచ్చింది.

## మెట్రో విస్తరణను కిషన్ రెడ్డే అడ్డుకుంటున్నారు: సీఎం రేవంత్ రెడ్డి

జపాన్ నుంచి నిధులు కూడా వచ్చాయని రేవంత్ తెలిపారు. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజకీయంగా నష్టం జరుగుతుందనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసే మెంట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాలపై కేంద్రాన్ని అడిగితే.. కింద సమస్యలు ఉన్నాయని తెలిపినట్లు వెల్లడించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని, అంతా మేమే భరిస్తాం, కేవలం ఎన్‌ఓసీ ఇవ్వండి కేంద్రం భాగస్వామ్యం లేకుండా నిర్మిస్తామన్నాం. సమస్యల పై చర్చిద్దామంటే కిషన్‌రెడ్డి సమయం ఇవ్వట్లేదని రేవంత్ అన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని తెలిపారు. కేవలం ఆయన నుంచి సహకారం మాత్రమే కోరుకుంటున్నానన్నారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతి, నిధులు ఇచ్చారని, విశాఖ మెట్రో నిర్మాణానికి కూడా అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, హైదరాబాద్ మెట్రోకు నిధులతో పాటు అనుమతులూ లేవని విమర్శించారు. అక్కడే వివక్ష ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు. కేసీఆర్‌కు కిషన్ రెడ్డి లొంగిపోయారని రేవంత్ ఆరోపించారు. ఆయనకు అంత తెలివిలేదంటూ ఘాటు విమర్శలు చేశారు. కేటీఆర్ చెప్పినట్లు నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి వెళ్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మెట్రో నిర్మాణాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించలేదన్నారు. ఇప్పుడు దాన్ని సరిచేసుకుంటామంటే వివిధ రకాలుగా అడ్డు తగులుతున్నారని ఆరోపించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు.. తరుణి సంస్థతో ఎంఓయూ

'బాల్య వివాహం బతుకు ఆగం' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని మంత్రి సీతక్క తెలిపారు. బాల్య వివాహాలు, మైనర్ బాలికల గర్భధారణలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు పై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

**అధికారులకు ప్రత్యేక శిక్షణ..**

అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. బాల్య వివాహాల గుర్తింపు, నివారణ, చట్టపరమైన చర్యలపై వారికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామని తెలిపారు. అదే విధంగా సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, ప్రచార సామగ్రి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. బాలికల విద్య కొనసాగింపు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, స్వయం సాధికారత అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

**స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి బాలికలు చేరుకోవాలి..**

బాల్య వివాహాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం మొత్తం కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క సూచించారు. ప్రతి బాలిక తన విద్యను పూర్తి చేసుకుని, స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవాలంటే బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలన దిశగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో బాల్య వివాహాల నివారణకు మరింత బలమైన వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు.. కిషన్ రెడ్డి పై మోదీ ప్రశంసలు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయన పై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. కిషన్‌రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా బొగ్గు, గనుల రంగాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలన్న మోదీ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం కిషన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ పురోగతికి దోహదపడుతోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు కూడా కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కిడ్నీ మరణాల్లో తెలంగాణ టాప్.. ఐసీఎంఆర్ నివేదికలో షాకింగ్ నిజాలు!

తెలంగాణలో దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల కారణంగా సంభవిస్తున్న మరణాలు దేశంలోనే అత్యధికంగా ఉన్నాయని తాజా అధ్యయనం ఒకటి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కిడ్నీ వైఫల్యాల మరణాల రేటులో రాష్ట్రం అన్ని రాష్ట్రాలను మించి అగ్రస్థానంలో నిలవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ప్రచురించే ప్రతిష్ఠాత్మక 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్'లో ఈ సమగ్ర పరిశోధనాత్మక వ్యాసం ప్రచురితమైంది. ఈ అధ్యయనం ప్రకారం తెలంగాణలో ప్రతి లక్ష మంది జనాభాకు సగటున 19.84 మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారు. ఇది జాతీయ సగటు కంటే చాలా రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. ఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ వైద్య నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. 1990 నుంచి 2023 వరకు 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్' గణాంకాలను ఆధారంగా చేసుకుని దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కిడ్నీ వ్యాధుల సరళిని, మరణాల రేటును లోతుగా విశ్లేషించారు. ఈ విశ్లేషణలో ప్రతి లక్ష మంది జనాభాలో 10,601 మంది దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్లు తేలింది. దేశంలోనే అతి తక్కువగా రాజస్థాన్‌లో ప్రతి లక్ష మందికి 6.71 మరణాలు నమోదవుతుండగా, తెలంగాణలో ఈ సంఖ్య గరిష్ఠంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధి కారణంగా ప్రజలు ఆరోగ్యకరమైన జీవితకాలాన్ని కోల్పోవడంలో కూడా తెలంగాణ ముందు వరుసలో ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

**మధుమేహమే ప్రధాన ముప్పు**

రాష్ట్రంలో కిడ్నీ వ్యాధులు ఇంతగా పెరిగిపోవడానికి ప్రధాన కారణం అదుపులో లేని మధుమేహమేనని పరిశోధకులు తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా నమోదయ్యే కిడ్నీ కేసుల్లో షుగర్ వ్యాధి పాత్ర 18% నుంచి 24% మధ్యలో ఉండగా, తెలంగాణలో ఈ శాతం చాలా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మధుమేహాన్ని సకాలంలో గుర్తించకపోవడం, చికిత్స తీసుకుంటున్నా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోకపోవడం వంటి కారణాల వల్ల కిడ్నీలు వేగంగా దెబ్బతింటున్నాయని అధ్యయనం వివరించింది. ముఖ్యంగా పేద, దిగువ మధ్యతరగతి వర్గాల ప్రజలే ఈ వ్యాధికి ఎక్కువగా బలవుతున్నారని, వ్యాధి ప్రాథమిక దశలో ఎటువంటి లక్షణాలు కనిపించకపోవడం, సరైన అవగాహన లేకపోవడంతో సమస్య ముదిరిన తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నారని పేర్కొంది.

**ప్రభుత్వానికి నిపుణుల సూచనలు**

ఈ భయంకరమైన పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పరిశోధకులు ప్రభుత్వానికి కొన్ని కీలక సూచనలు చేశారు. కిడ్నీ వ్యాధుల నివారణను ప్రభుత్వం ఒక ప్రాధాన్యతాంశంగా గుర్తించి, బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని సిఫార్సు చేశారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న రోగులందరికీ గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఉచితంగా క్రియాటినిన్, మూత్ర పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. తద్వారా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, తీవ్రతను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, పేద రోగులకు ఉచిత డయాలసిస్, కిడ్నీ మార్పిడి సేవలను మరింత విస్తృతం చేసి, సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకోసం వైద్య మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన మెరుగుపరచాలని నిపుణులు స్పష్టం చేశారు.

## ఏపీ, తెలంగాణలకు చల్లని కబురు: హైదరాబాద్‌ను తాకిన నైరుతి

నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుగ్గా పురోగమిస్తున్నాయి. ఇవి తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న 4 నుంచి 5 రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఆదివారం నాటికి రుతుపవనాల ఉత్తర సరిహద్దు (నార్తర్న్ లిమిట్ ఆఫ్ మాన్‌సూన్) మహారాష్ట్రలోని హర్నై, సోలాపూర్ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడి నుంచి పారాదీప్, బరిపడ, ధన్‌బాద్ మీదుగా ముజఫర్‌పూర్ వరకు రుతుపవనాలువిస్తరణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. రానున్న 4-5 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయి. అలాగే ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లోకి కూడా ఇవి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తన తాజా బులెటిన్‌లో వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

## రుచుల రాజధానిగా హైదరాబాద్‌కు జాతీయ గుర్తింపు..

హంస కలం వార్త జూన్ 15


తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక ఇండియా టుడే టూరిజం అవార్డ్స్‌లో హైదరాబాద్‌కు 'నేషనల్ కలినరీ డెస్టినేషన్' అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా ఆహార సంస్కృతి, ప్రత్యేక వంటకాలు, పర్యాటక ఆకర్షణల ఆధారంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. గోవాలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, తెలంగాణ సంప్రదాయ వంటకాలు, వైవిధ్యభరితమైన ఆహార సంస్కృతికి ఈ అవార్డు జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చిందని వివరించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన హైదరాబాద్ వంటకాల ప్రత్యేకత దేశ విదేశాల పర్యాటకులను ఆకర్షిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ అవార్డుతో ప్రపంచ ఆహార నగరాల జాబితాలో హైదరాబాద్ ఖ్యాతి మరింత పెరిగిందని తెలిపారు. తెలంగాణ పర్యాటక రంగం, ఆహార సంస్కృతి, ఆతిథ్య రంగాల అభివృద్ధికి ఇది గొప్ప గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## అమ్మ చుట్టూ తారాడే కవిత

కొంచెం ప్రయత్నిస్తే పూర్తి చేయగలిగే పజిల్స్, గళ్ళ నుడి కట్టు, పద ప్రహేళికల్లా ఉంటుంది శ్రీకాంత్ కవిత్వం. మనసు 'భాష' తెలిసిన వారికి అది సులభంగాను, తెలియని వారికి కఠినంగాను అనిపిస్తుంది అమ్మ చుట్టూ తారాడే కవిత కొంచెం ప్రయత్నిస్తే పూర్తి చేయగలిగే పజిల్స్, గళ్ళ నుడి కట్టు, పద ప్రహేళికల్లా ఉంటుంది శ్రీకాంత్ కవిత్వం. మనసు 'భాష' తెలిసిన వారికి అది సులభంగాను, తెలియని వారికి కఠినంగాను అనిపిస్తుంది. మేధావితనం ఇక్కడ ఖచ్చితంగా పూర్తిగా ఓడిపోతుంది. కవితావరణంలో కొన్ని సమాధానాల్ని వెదజల్లుతాడు. వాటిని సంతృప్తిపరిచే అన్వయాల్ని, వాటి వెంట కోడిపిల్లల్లా తరుముతాడు. సహేతుక కారణాలను ఎగరేస్తాడు. చివరిగా ప్రశ్నల్ని పట్టుకున్న దారపు చేతిని మృదువుగా స్పృశిస్తాడు. "ఏమీ లేదు/ ఈ ఉదయం ఇంటికి వెళ్లాను/ ఒక అతిథి వలె అమ్మని చూసొచ్చాను" ('అతిథి') ఒక్కోసారి పాక్షిక సంభాషణ సైతం మొత్తం కవితను వెలిగిస్తుంది. అయితే సంధించే ప్రశ్నకు సమాధానం పరిసర దృశ్య శకలాల రూపంలో ఎదురవుతుంది. ఒక వృత్తం చుట్టడం పూర్తవుతుంది. ఇకపై ఆవృత సన్నివేశం రక్తి కడుతుంది. సాధారణ వాక్యానికి, కవితాత్మక వాక్యానికి ఉన్న తేడా ఈ కవిత్వంలో స్పష్టంగా గమనించవచ్చు. అ) మూడు రోజులుగా తన దేహం అలసిపోయి మంచం పైకి వాలిపోయింది (సాధారణ వాక్యం) ఆ) మూడు రోజులుగా తన దేహం అలసిపోయి వేర్లు వెలుపలికి వచ్చి ఒరిగిపోయిన వృక్షంలా, మంచం పైకి రాలిపోయింది (కవితాత్మక వాక్యం) ఒక పోలికతో (ఉపమ) సాధారణ వాక్యం, కవితాత్మక వాక్యంగా మారిపోయింది. ఒక క్రియ ఎలా జరిగిందో చెప్పబడింది (మూర్తం). ఇ) మోకాళ్ళ మధ్య నొప్పిరా కన్నా (సాధారణ వాక్యం) ఈ) మోకాళ్ళ మధ్య నుంచి నలువైపులా నరాలు చీలిపోతున్నట్టు భరించలేని నొప్పి రా కన్నా (కవితాత్మక వాక్యం) ఒక నొప్పి తీవ్రత ఎటువంటిదో కన్వే చేయబడింది (అమూర్తం) ఇక్కడ మూర్త, అమూర్త విషయాల్నీ మూర్త విషయాలతో పోల్చి చెప్పటం ప్రధానంగా కనిపిస్తుంది. "అమ్మ, ఉద్యోగానికి వెళ్లడం/ లేదిప్పుడు--/ అయినా, అన్నం పప్పూ/ కానీ, కర్రీ పాయింట్లో/ అదే నల్లని ఆ ప్రేమ రాహిత్యపు నీడ/ ఇప్పటికీ తన చుట్టూ చిరిగిన పర్సులో దాచుకున్న అతని ప్రియమైన ముఖంలాగా!" ('నీడ') "ఇక్కడ కవిత దేదీప్యమానంగా వెలిగింది" అని చెప్పుకునే చోటే ఆ వాక్యాల్ని తద్విరుద్ధమైన అనుభూతి పట్టి పీడించే అవస్థ ఎంతటి పారడాక్సో కదా! "ఇదే రాత్రి/ అలసిన అమ్మ అటువైపుకి తిరిగి నిదురోయింది" "రాత్రి తనువుని పెనవేసుకుని/ అటువైపుకు తిరిగి నిదురోయే అమ్మని ఎందుకైనా/ ఎవరైనా ఎలా కదపటం?" ('అమ్మ') రెండు వాక్యాల మధ్య సంచరిస్తున్న ఒంటరితనపు దిగులు నిశ్శబ్దం కథలు కథలుగా రూపాంతరం చెందుతున్న స??థితి! ఒకటి ఎత్తుగడ. రెండోది ముగింపు లేని వాక్యం. ఇక్కడ 'రాత్రి తనువుని పెనవేసుకుని' అనే అర్థం అసలు కారణాన్ని ముందుకు తోస్తుంది. ఈ 'వీక్ష్తవతీ' పుస్తకంలోని ప్రతి కవితకూ ఒక ఇంటర్నల్ కో రిలేషన్ ఉంది. మొదటి కవిత ('అమ్మ కళ్ళు')లో ప్రస్తావించిన ఎత్తుగడ ("చీకట్లో వెలిగించిన రెండు దీపాల్లా వెలుగుతాయి నీ కళ్ళు")కు, చివరి కవిత ('ముగింపు')లో చెప్పబడిన వాక్యాలకు ("ఏం ప్రయోజనం నీ కవిత్వంతో? వెలిగే దీపాలను చేయగలవా మళ్ళా కళ్ళను?") మధ్యగల సహసంబంధాన్ని గుర్తిస్తే ఈ విషయం అర్థమవుతుంది. మొత్తంగా అంతర్దహనం లాంటి అంతర్మథనంతో కొనసాగిన కవిత అంతర్లీనంగా వాస్తవ జీవిత పరంపరగా కనిపిస్తుంది. "ఇక తన గొంతు మీదుగా జారి, నింపాదిగా తన అరచేతుల్లోకి చేరి ఒదిగి కూర్చుంది ఎండ, కోడిపిల్లై,--" సూక్ష్మాతి సూక్ష్మమైన దృశ్యాన్ని ఫ్రేముల్లో బంధించడం శ్రీకాంత్‌కు సులువైన పని. అసమానమైన ప్రతీకలేవీ కనపడి అబ్బురపరచకపోవచ్చు. కానీ ఇవే నిజమని అంతకుముందరి సిద్ధ ప్రతీకలన్నీ భోగిమంటల్లో పడేసి బూడిద చేస్తాం. ఈ కవి ఆ ప్రాసెస్‌ను అబ్జర్వేషన్లో పెడతాడు కూడా. "సరిగ్గా అప్పుడే, సరిగ్గా ఇప్పటిలాగే పిలిచింది నీ తల్లి/ మరి నిన్ను; అన్నం ఉడికిందనీ/ ఆడిన ఆటలు ఇక చాలించి, త్వరగా ఇంటికి రమ్మనీ--/మరి ఇన్నాళ్లకయినా, నీ తల్లికి కానీ, మీ ఇంటికి కానీ/నీకు కానీ దారి కనుక్కొని, చేరుకోగలిగావా నువ్వు?!" ('ప్త్రశీఎవ') పుస్తకంలోని ప్రతి కవితకు ఒక కీ పాయింట్ ఉంటుంది. అది ఒక సందర్భమో, సంభాషణో, జ్ఞాపకమో, వర్తమానమో ఏదైనా అయి ఉండొచ్చు. ఆ పాయింట్‌ను పట్టుకొని చుట్టూ ఒక ఎమోషనల్ టచ్ ఉండే వాతావరణాన్ని సృష్టించడం, చివరికి అనుకున్న అంశం గురించి మాట్లాడటం-- ఏదో ఒకటి తేల్చి పడేయడం-- రాను రాను అది ఫలవంతమై పరిపక్వ దశను దాటి తాత్విక స్థాయికి చేరుకోవడం-- ప్రతీసారి మొత్తం పుస్తకంలో ఆ కీ పాయింట్ 'అమ్మ' కేంద్రంగానే ఉండటం ఈ కవిత్వం ఆసాంతం మనం చూడవచ్చు. ేలికైన పదాలతో హృదయాన్ని బరువెక్కించగల తడి తడి వాక్యాల ఈ కవిత్వానికి చెమ్మగిల్లి నయనాలతో సాగిలపడతారు పాఠకులు. ఒక ప్రతీకను ("పిల్లి కూనలాంటి అమ్మ") తీసుకుంటే దాన్ని సమర్థించే కథనం మొత్తం కవిత్వమై కాళ్లల్లా మెదులుతుంటది. "అందరూ గెలలు కోసుకున్నాక, తెగనరికిన అరటి చెట్టు లాంటి అమ్మ" లాంటి ప్రతీకతో మొదలైన కవిత అనిర్వచనీయమైన భావోద్వేగానికి గురిచేస్తూ "ఐదారేళ్ల పాప కళ్ళతో అట్లా చూసే అమ్మ"తో ముగుస్తుంది. 'అమ్మా నేనిక వెళ్తాను' అని అంటే ('లిప్తకాలం')-- నిస్తేజంగా చూసే అమ్మలు, అపురూపంగా చూసుకున్న అమ్మల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసే కొడుకులు ('అమ్మీ'), పిల్లలు అమ్మను తినమని అడిగినప్పుడు-- వాళ్ళమ్మతో ఎప్పుడైనా అలా మాట్లాడానా? అని తండ్రి మథనపడటం ('ఒక క్షణం'); చాలా రోజులకి ఇంటికెళ్లిన కొడుకును కావలించుకుని బావురుమనే ఓ తల్లి ('గుర్తు') ఇలా చాలా కనిపిస్తాయి ఈ పుస్తకంలో. ఎందరో తల్లులు తారసపడతారు. మరలా మరలా పురుషాంగం అవుతున్న దేశాన్ని, రాజ్యం పీలికలు చేస్తున్న యోనుల్ని గురించి కూడా మాట్లాడతాడు కవి ('మన/ తల్లులు'). "ఎలా రాయటం నొప్పిని?" అని నిత్యం సంఘర్షించే కవి శ్రీకాంత్!

# 21వ శతాబ్ది కవిత్వం ఎటు నుంచి ఎటు వైపు



21వ శతాబ్ది తెలుగు కవిత్వంలో మనిషి పరిచయాన్ని మనం మూడు ప్రధాన కోణాల్లో చూడవచ్చు. మొదటిది-- ప్రపంచీకరణ, యాంత్రికత మధ్య మనిషి స్థితి. గ్లోబలైజేషన్ తర్వాత వచ్చిన మార్పులు మనిషిని ఒక వైపు ప్రపంచ పౌరుడిగా నిలబెడితే, మరోవైపు ఒక యంత్రంలో భాగంగా మార్చేశాయి. సోషల్ మీడియాలో వేలమంది 'ఫ్రెండ్స్' ఉన్నా, మనిషి లోలోపల అనుభవించే తీవ్రమైన ఒంటరితనాన్ని ఆధునిక కవిత్వం బలంగా పట్టుకుంది. దీనికి తోడు వినియోగవాదం పెరిగిపోయి, వస్తువులే మనిషి విలువను నిర్ణయించే ఈ కాలంలో, తన ఉనికిని కోల్పోతున్న సామాన్యుడి వేదన నేటి కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. రెండవది-- అస్తిత్వ చైతన్యం, బహుళ స్వరాలు. ఈ శతాబ్దపు కవిత్వంలో మనిషి అంటే కేవలం ఒక మూస మనిషి కాదు. లింగ, కుల, ప్రాంతీయ అస్తిత్వాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. దళిత, బహుజన, మైనారిటీ స్వరాల ద్వారా అణచివేతకు గురైన మనిషి తన చరిత్రను తానే తిరగరాసుకుంటున్న ప్రక్రియ కనిపిస్తుంది. అలాగే స్త్రీవాద దృక్పథంతో గృహ హింస నుంచి సామాజిక వివక్ష వరకు, స్త్రీ తన ఉనికినీ తన దేహంపై తనకున్న హక్కునూ కవితాత్మకంగా ప్రకటిస్తోంది. మూడవది-- పర్యావరణం, సాంకేతికతతో మనిషికి ఉన్న సంబంధం. పర్యావరణ స్పృహతో ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్న మనిషిని హెచ్చరిస్తూనే, తన మూలాల కోసం పరితపించే మానవుడిని నేటి కవిత్వం ఆవిష్కరిస్తోంది. అదే సమయంలో, స్మార్ట్‌ఫోన్ తెరల వెనుక దాక్కున్న భావోద్వేగాలను, వర్చువల్ ప్రపంచంలో కరిగిపోతున్న మానవీయ సంబంధాలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ ఒక 'డిజిటల్ మనిషి'ని కళ్ళకు కడుతోంది. మొత్తంగా చెప్పాలంటే, 21వ శతాబ్దపు వచన కవిత్వంలోని మనిషి ఛిద్రమైన వ్యక్తిత్వం కలవాడు. అతడు ఒకవైపు ఆధునిక పురోగతిని ఆస్వాదిస్తూనే, మరోవైపు నైతిక విలువల పతనాన్ని చూసి భయపడుతున్నాడు. ఈ కాలపు కవిత్వం మనిషిని దేవుడిగానో, రాక్షసుడిగానో చిత్రించకుండా... లోపాలు, ఆశలు, ఆవేదనలు ఉన్న ఒక సజీవ అస్తిత్వంగా గుర్తిస్తూ, అతడి నిజమైన ఆత్మకథను ఆవిష్కరిస్తోంది. నేటి కవిత్వంలో అస్పష్టత తగ్గి వస్తువుకు ప్రాధాన్యత పెరిగింది. కవులు పాఠకులకు సులభంగా అర్థమయ్యేలా రాయగలుగుతున్నారు. భావ, అభ్యుదయ, విప్లవ కవితా ఉద్యమాల ఉధృతి తగ్గినప్పటికీ, అవి ఇంకా కవిత్వంలో కనిపిస్తూనే ఉన్నాయి. కవిత్వంలో సామ్రాజ్యవాద నిరసన, రాజకీయ ధోరణులను ఎండగట్టడం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత పెరిగింది. విప్లవ కవిత్వంలో సాయుధ పోరాట తీవ్రత తగ్గింది. ముఖ్యంగా ఈ శతాబ్దంలో అస్తిత్వ ఉద్యమ కవిత్వం (స్త్రీ, దళిత, మైనారిటీ, బీసీ, ప్రాంతీయ వాదాల కవిత్వం) చాలా బలంగా నిలిచింది. రూప నిర్మాణంలో కవులు సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. పేరాగ్రాఫ్ కవిత్వం వచ్చింది. కవిత్వ పాద విభజనలో ప్రయోగాలు ఇందులో భాగమే. సమాజంలో మాట్లాడే తెలుగులో ఆంగ్ల పదాలు దొర్లినట్లే, కవిత్వంలోనూ ఆంగ్ల, వైజ్ఞానిక, సాంకేతిక పదాలను సహజంగా ఉపయోగించి కవులు పాఠకులకు మరింత దగ్గరయ్యారు. అలాగే నిరలంకార శైలిని పాఠకులు ఇష్టపడుతున్నారు. తెలంగాణ, ఉత్తరాంధ్ర కవిత్వంలో విస్తృతంగా మాండలిక వినియోగం పెరిగింది. కవులు ఇంకా పట్టుకోవాల్సిన వస్తువులు ఉన్నాయి. టెక్నాలజీ కేవలం ఒక సాధనంగా కాకుండా, మనిషి ఆలోచనా సరళిని, సృజనాత్మకతను శాసించే స్థాయికి చేరింది. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో 'అసలైన మానవీయత ఏమిటి?' అనే ప్రశ్నను, యంత్రాల మధ్య మనిషి ఎదుర్కొంటున్న మానసిక ఒంటరితనాన్ని కవిత్వం ఇంకా బలంగా పట్టుకోవాలి. సోషల్ మీడియా వల్ల ప్రపంచం మొత్తం కనెక్ట్ అయినట్టు కనిపిస్తున్నా, లోలోపల మనిషి తీవ్రమైన ఒంటరితనాన్ని, 'ఖీమీ' (ఖీముతీ శీట వీఱంంఱఅస్త్ర ాబ్) వంటి మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాడు. వర్చువల్ లైక్స్ వెనుక దాగున్న వాస్తవ వేదనలు, డిప్రెషన్, మానసిక ఆరోగ్యం వంటి అంశాలు కవిత్వంలో ప్రధాన వస్తువులు కావాల్సి ఉంది. క్లైమేట్ చేంజ్ వల్ల ఊళ్లు వదిలి వలసపోతున్న పర్యావరణ శరణార్థుల కన్నీళ్లు, గ్లోబల్ వార్మింగ్ తెస్తున్న ప్రకృతి విపత్తుల తీవ్రతను ఒక హెచ్చరికగా, అంతర్జాతీయ దృక్పథంతో కవిత్వీకరించడం ఇంకా పెరగాలి. ఆధునిక కాలంలో మనిషి సమాచారమే ఒక పెట్టుబడి. మన ప్రతి కదలిక డిజిటల్ నిఘా నీడలో ఉంది. వ్యక్తిగత స్వేచ్ఛ హరించుకుపోతున్న తీరును, కార్పొరేట్ శక్తులు మానవ మేధస్సును కంట్రోల్ చేస్తున్న విధానాన్ని కవులు ప్రశ్నించాల్సి ఉంది. స్త్రీ, పురుష సమానత్వానికి ఆవల ఉన్న క్వీర్ కమ్యూనిటీల అంతరంగిక సంఘర్షణలు, సమాజం వారిని చూసే కోణం, వారి హక్కుల గురించిన అస్తిత్వ కవిత్వం మన తెలుగు వంటి ప్రాంతీయ భాషల్లో ఇంకా ప్రధాన స్రవంతిలోకి రావాల్సి ఉంది. స్త్రీ, దళిత అస్తిత్వవాదాల తీవ్రత పోయిందని అనిపిస్తుంది. కవిత్వం రాసే మధ్యతరగతి ఉద్వేగాలకీ ఉద్యమాలకీ పూర్తిగా ఎడమైపోయారు. దాంతో వాళ్ళ కవిత్వంలో నాస్టాల్జిక్ ఛాయ కనిపిస్తోంది. అయితే, అస్తిత్వ ఉద్యమాల ప్రభావం "తగ్గింది" అంటే అవి పూర్తిగా అంతరించిపోయాయని కాదు. వాటి రూపం మారింది. ఉరుములు, మెరుపులతో సాగే తుఫాను లాంటి ఉద్యమ దశ నుండి, నిశ్శబ్దంగా నరనరాన జీర్ణించుకునే చైతన్య దశకు ఇవి చేరుకున్నాయి. నేడు రాస్తున్న ఏ కవితలోనైనా అస్తిత్వ స్పృహ అనేది ఒక సహజ అంతస్సూత్రంగా మారిపోవడమే ఈ ఉద్యమాలు సాధించిన అసలైన విజయం. ప్రధాన అస్తిత్వ ఉద్యమాల్లో వచ్చిన అంతర్గత చీలికలు కూడా వాటి బలాన్ని తగ్గించాయి. ఉదాహరణకు, దళిత వాదంలో ఉప--కులాల వర్గీకరణ చుట్టూ జరిగిన చర్చలు, బీసీ వాదంలో విభిన్న కుల వృత్తుల అంతర్గత వైరుధ్యాలు ఉద్యమాన్ని సమూహంగా కాకుండా విడివిడిగా మార్చేశాయి. ఈ అంతర్గత విభేదాల వల్ల ఉమ్మడి శత్రువుపై లేదా వ్యవస్థపై గురి పెట్టాల్సిన శిల్పం, శక్తి క్షీణించాయి. ఒకప్పుడు అస్తిత్వ ఉద్యమాలకు ఒక బలమైన సామూహిక వేదిక, పత్రికలు, సంపాదకీయాలు ఉండేవి. కానీ నేడు సోషల్ మీడియా (ఫేస్‌బుక్, ఎక్స్, వాట్సాప్ గ్రూపులు) రావడంతో సాహిత్యం పూర్తిగా వికేంద్రీకరించబడింది. ఎవరికి వారు తమ వ్యక్తిగత వేదికలపై స్పందిస్తున్నారు తప్ప, ఒక సిద్ధాంతపరమైన క్రమశిక్షణతో కూడిన 'ఉద్యమం'గా అది రూపాంతరం చెందడం లేదు. తక్షణ స్పందనలు (×అర్ఘుత్ =ముఘ్మీఅశీఅం) ఎక్కువై, దీర్ఘకాలిక ఉద్యమ తాత్వికత కొరవడింది. కేవలం పుస్తకాల్లో ముద్రించే కవిత్వ రూపం నుండి డిజిటల్ స్క్రీన్‌లపై చదివే రూపంలోకి కవిత్వం మారాలి. ఒక కవిత చదువుతున్నప్పుడు అందులోని లింక్స్ క్లిక్ చేస్తే మరో అర్థం లేదా దృశ్యం వచ్చేలా 'హైపర్ టెక్స్ట్' నిర్మాణాన్ని వాడవచ్చు. నేటి తరం పాఠకుడి అటెన్షన్ స్పాన్ (ఆసక్తి సమయం) చాలా తక్కువ. కాబట్టి, రూమీ కవిత్వం లాగానో లేదా ఆధునిక 'ఇన్‌స్టా--పోయెట్రీ' (ఉదాహరణకు రూపీ కౌర్ శైలి) లాగానో, రెండు మూడు పంక్తుల్లోనే సునిశితమైన శిల్పంతో, గుండెను తాకేలా కవితా నిర్మాణాన్ని మార్చాల్సి ఉంది. అక్షర రూపం నుండి కవిత్వం దృశ్య--శ్రవణ రూపంలోకి మారాలి. కవితను చదివే విధానంలో 'స్పోకెన్ వర్డ్ పోయెట్రీ' టెక్నిక్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్ ఉపయోగించి కవితా శిల్పానికి సరికొత్త రూపాన్ని ఇవ్వవచ్చు. 21వ శతాబ్దపు కవి కేవలం సమాజంలో జరిగే సంఘటనలకు స్పందించే రిపోర్టర్ లాగా కాకుండా, భవిష్యత్తును ముందుగానే ఊహించే 'ద్రష్ట'గా మారి, ఈ గ్లోబల్ నూతన సవాళ్లను తనదైన శైలిలో అక్షరబద్ధం చేయాల్సి ఉంది.

# ఈ వారం వివిధ కార్యక్రమాలు

**-'మెరుగు 2.0' కవిత్వ పఠనం**

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'మెరుగు 2.0' ప్రారంభ కార్యక్రమం జూన్ 15 సాయంత్రం 6 గంటలకు విజయనగరంలో గురజాడ గృహంలో జరుగుతుంది. ఇడదాసు తిరుపతి రాజు, జైపాల్ రావు, కాకర మౌనిక, బాలమురళీకృష్ణ కవిత్వం చదువుతారు. కంచరాన భుజంగరావు, మానాపురం రాజా చంద్రశేఖర్ సమీక్షిస్తారు.పాయల మురళీకృష్ణ

**-'నాన్న చెక్కిన శిల్పం' ఆవిష్కరణ**

జాలాది రత్న సుధీర్ రచన 'నాన్న చెక్కిన శిల్పం' ఆవిష్కరణ సభ జూన్ 20 సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. తెలంగాణ సాహిత్య అకాడమీ 'సాహిత్యవారం' కార్యక్రమంలో భాగంగా జరిగే ఈ సభలో నామోజు బాలాచారి, ఏనుగు నరసింహారెడ్డి, ఏ. దినకర్ బాబు, ఎస్. రఘు, నీలిమ వి.ఎస్.రావు, సి.ఎస్. రాంబాబు తదితరులు పాల్గొంటారు. గుడిపాటి

**-పీర్ల పండుగ కవి సమ్మేళనం**

అలాయి బలాయి, నెలపొడుపు సాహిత్య వేదికల సంయుక్త ఆధ్వర్యంలో పీర్ల పండుగ సందర్భంగా 'అక్షరాల అలువ' పేరుతో కవి సమ్మేళనం జూన్ 21 సాయంత్రం 5 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, యాకూబ్, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు.



కవులు పేర్లను నమోదుచేసుకోవాల్సిన నంబర్: 94927 65358.

**-వనపట్ల సుబ్బయ్య 'ఈర్నం' కవితా సంపుటి**

చిగురుపల్లి చంద్రకళ స్మారక వేదిక ఆధ్వర్యంలో కలమట దాసుబాబు తొలి కవిత్వ సంపుటి 'ఈర్నం' ఆవిష్కరణ సభ జూన్ 21 ఉదయం శ్రీకాకుళం టౌన్‌లో వరం రెసిడెన్సీలో జరుగుతుంది. సభలో గుంటూరు లక్ష్మీనరసయ్య, అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌరునాయుడు, చిగురుపల్లి ప్రభాకరరావు తదితరులు పాల్గొంటారు.

**-శ్రీకాకుళ సాహితి కవితలకు ఆహ్వానం**

మల్లెతీగ పురస్కారం--2026 కోసం కవితలు ఆహ్వానిస్తున్నాం. ప్రధాన పురస్కారం రూ .8 వేలు, ఆత్మీయ పురస్కారం రూ.1000 చొప్పున ఐదుగురికి. సామాజికాంశాల్ని స్పృశించే కవితల్ని జూన్ 30లోపు మీ ఫోటోపాటు కొరియర్ లేదా రిజిస్టర్ పోస్టులో ఎడిటర్, నవమల్లెతీగ, 26--16--4, టి--ఎఫ్ 1, శుభశ్రీ టవర్స్, ఉయ్యూరు జమిందార్ స్ట్రీట్, గాంధీ నగర్, విజయవాడ--520003, ఫోన్: 92464 15150 కు, లేదా ఈమెయిల్ ద్వారా malleteega.sss@gmail.com! పంపాలి.

# జర్మన్ నేర్చుకోండి...విదేశీ జాబ్స్ ఖాయం

-జర్మన్ భాషతో విదేశీ ఉద్యోగాల దారి: మంత్రి వివేక్..
-అధిక వేతనాలకు భాషా ప్రావీణ్యమే కీలకం..
-తరగతులు మిస్ కాకుండా క్రమశిక్షణపై దృష్టి..
-మందమర్రి కోర్సుకు యువత భారీ స్పందన..

హంస కలం వార్త జూన్ 15 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

హైదరాబాద్‌లో విదేశీ భాషా శిక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించగా, జర్మన్ భాష నేర్చుకుంటున్న యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో భాషా నైపుణ్యాన్ని పెంచుకుంటే విదేశాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలను సులభంగా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని టామ్ కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్మనీలో ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకుని యువతకు ప్రత్యేకంగా భాషా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సింగ్, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో విదేశాల్లో



విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ, జర్మనీలో లభించే వేతనాలు భారత కరెన్సీ విలువలో అధికంగా ఉంటాయని వివరించారు. విదేశీ ఉద్యోగ సాధనలో భాషా ప్రావీణ్యం ప్రధాన అడ్డంకిగా మారుతోందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ అడ్డంకిని అధిగమించాలంటే నిరంతర అభ్యాసం, తరగతులకు క్రమం తప్పకుండా హాజరు అత్యవసరమని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థి ఒక్క తరగతి కూడా మిస్ కాకుండా పూర్తి నిబద్ధతతో శిక్షణ పొందాలని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల మంచిర్యాల జిల్లా మందమర్రిలో ప్రారంభించిన జర్మన్ భాషా తరగతులకు విశేష స్పందన లభించిందని మంత్రి తెలిపారు. దాదాపు 200 మంది యువత ఈ కోర్సులో చేరడం సంతోషకరమని, అక్కడి అధ్యాపకుడు కూడా అత్యంత ప్రతిభా వంతుడిగా ఉన్నారని ఆయన ప్రశంసించారు. విద్యార్థుల హాజరును నిరంతరం



పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, తాను కూడా క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే తెలుగు భాషను నేర్చుకున్నానని మంత్రి పేర్కొన్నారు. ఏ భాష అయినా పట్టుదలతో నేర్చుకుంటే విజయాన్ని సాధించవచ్చని ఆయన వివరించారు. ఈ తరహా విదేశీ భాషా శిక్షణ కార్యక్రమాలు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో స్థిరమైన కెరీర్ నిర్మాణానికి దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# పిల్లల భవిష్యత్తు విద్యలోనే



- బాల్యం పనిలో కాదు.. బడిలోనే ఉండాలి: మంత్రి..
-బాల కార్మిక నిర్మూలనకు సామాజిక ఉద్యమం అవసరం..
-పేద పిల్లలకు తిరిగి విద్యాబాటపై ప్రభుత్వం దృష్టి..
- నైపుణ్య కేంద్రాలతో యువతకు కొత్త అవకాశాలు..

హంస కలం వార్త జూన్ 15 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

బాల్యం అంటే పాఠశాల ప్రాంగణంలో ఉండాల్సిన అమూల్యమైన దశగా నిలవాలి తప్ప పనివేళలలో నలిగిపోకూడదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి స్పష్టంగా పేర్కొన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమం తీవ్ర భావోద్వేగాలు, సామాజిక బాధ్యత అంశాలతో హాట్ టాపిక్‌గా మారింది. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా ఒక పెద్ద సామాజిక ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి చిన్నారి విద్యను పొందే హక్కు కలిగి ఉన్నారని, ఆ హక్కును కాపాడటం సమాజం మొత్తం బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. పేదరికం, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది చిన్నారులు పనుల్లోకి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి, అలాంటి పిల్లలను గుర్తించి తిరిగి బడుల్లో చేర్చడం ద్వారా వారి జీవితాలను మారుస్తామని తెలిపారు. బాల్యం కోల్పోకుండా చూడటం, వారికి నాణ్యమైన విద్య అందించడం భవిష్యత్తు తరాలకు బలమైన పునాది వేస్తుందని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించినట్లుగా విద్యే జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే మార్గమని గుర్తు చేసిన మంత్రి, గతంలో బాల కార్మికులుగా ఉన్న పలువురు ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడటం విద్య శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, సోషల్ మీడియా సహా అన్ని వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు కలిసి పనిచేస్తేనే బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విదేశీ ఉద్యోగాలకు అవసరమైన భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువత భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తల సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. బాల కార్మికులను రక్షించి విద్యా బాట పట్టించడంలో వారి పాత్ర ఆదర్శనీయమని కొనియాడారు. చివరగా, బాల కార్మిక వ్యవస్థ లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, మంచి భవిష్యత్తు కల్పించేందుకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ప్రజావాణిలో సమస్యల జాతం

-ప్రజావాణిలో సమస్యల వెల్లువ..
-ఇల్లు, భూమి, పథకాలపై అర్జీలు.
-వరద నష్టం, ఆక్రమణ ఫిర్యాదులు..
-విద్యా పనుల వేగవంతానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు..

హంస కలం వార్త జూన్ 15 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

మంచిర్యాల జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కార వేదికగా మరింత చురుకుగా మారిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్‌తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు కలెక్టర్‌ను ప్రత్యక్షంగా కలిసి వినతులు అందజేశారు. చెన్నూరు మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన కావేరి శోభ తన పేరు ఇందిరమ్మ గృహాల మొదటి జాబితాలో వచ్చిందని, వెంటనే ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సెగ్గెం ప్రసాద్ తన జీవనాధారంగా ఆటోతో పాటు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కట్ల పోసక్క, కట్ల పోచం గ్రామ శివారులో చేపడుతున్న కల్వర్టు నిర్మాణంతో తమ భూమి ఆక్రమణకు గురవుతోందని, దీనిపై న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సత్యనారాయణరావు లక్సెట్టిపేట మండలం మోదెల గ్రామంలో తన భూమి గోదావరి వరద నీటిలో మునిగిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. దేవాపూర్‌కు చెందిన కాంపెలి వెంకటేశం తన కుమారుడికి లక్సెట్టిపేట మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో సీటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కళ్యాణి తనకు గృహజ్యోతి, గ్యాస్ రాయితీ పథకాలు వర్తింపచేయాలని కోరారు. అన్ని



అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ హామీ ఇచ్చారు. అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను సమీక్షించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను క్రమబద్ధంగా అమలు చేసి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యా సంవత్సరం ఘన ప్రారంభం

-మొదటి రోజు నుంచే పాఠ్యపుస్తకాలు పంపిణీ..
- సారంగపల్లి పాఠశాలల్లో సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ..
-ప్రభుత్వ విద్యకు గ్రామస్థాయిలో ప్రాధాన్యం..
-విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం..



హంస కలం వార్త జూన్ 15 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

మంచిర్యాల జిల్లాలో నూతన విద్యా సంవత్సర ప్రారంభోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. విద్యార్థులు మొదటి రోజు నుంచే పుస్తకాలతో తరగతులకు హాజరవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలోనే పుస్తకాలు అందజేయడం పేద విద్యార్థులకు పెద్ద ఊరటగా మారింది. గ్రామాల్లో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందన్న అంశం మరోసారి ఈ కార్యక్రమంతో స్పష్టమైంది. మందమర్రి మండలం, సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో సర్పంచ్ బచ్చలి రాములు చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్స్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొదటి రోజు నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాలతో పోలిస్తే ప్రస్తుతం విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, పేద విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సవ్య, స్థానిక వార్డు సభ్యులు షెబ్బీర్, మంద సువర్ణ, గారె కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిత్తాపూర్‌లో విద్యా విజయోత్సవం

-టాప్ విద్యార్థులకు గ్రామంలో ఘన సన్మానం..
-ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు..
-గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రోత్సాహ కార్యక్రమం..
-విద్యా పోటీ పెంపుపై స్థానికుల హర్షం..




హంస కలం వార్త జూన్ 15 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యా ప్రమాణాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమం మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలం చిత్తాపూర్ గ్రామంలో ఉత్సాహభరితంగా జరిగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గ్రామపంచాయతీ కార్యదర్శి స్రవంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కమల మల్లయ్య, ఉపసర్పంచ్ తీగుళ్ల వెంకటేష్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల ప్రతిభను గ్రామపంచాయతీ స్థాయిలోనే గుర్తించి ప్రోత్సహించడం ద్వారా చదువులో మరింత పోటీ తత్వం పెరుగుతుందని, విద్యార్థులు మరింత శ్రమతో ముందుకు సాగేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యాభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ అవకాశాలు, చదువులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్రపై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. గ్రామస్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, ఉన్నత విద్య వైపు అడుగులు వేయడానికి దోహదపడతాయని స్థానికులు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, శాలువాలు అందజేసి ప్రోత్సాహం కల్పించారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యా రంగంపై సానుకూల వాతావరణాన్ని తీసుకువచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల విజయాలను గ్రామస్థాయిలో గౌరవించడం ద్వారా ఇతర విద్యార్థులకు సైతం స్ఫూర్తి లభిస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని నింపిందని హర్షం వ్యక్తమైంది..

## పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

-తుంబూరు దయాకర్ రెడ్డి

-మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో 46 మందికి అందజేత..



హంస కలం వార్త జూన్ 15

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి మధ్యవర్తులు లేకుండా,వంద శాతం పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.16,64,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు రూపాయి కూడా పక్కదారి పట్టకుండా, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తూ నేరుగా లబ్ధిదారుల చేతులకే ఈ ఆర్థిక సాయం అందేలా చూస్తున్నామని వివరించారు.కార్పొరేట్ వైద్య భారాన్ని మోయలేక సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఈ సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల

హంస కలం వార్త జూన్ 15



ప్రజాభవన్ లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను కలిసి శాలువా కప్పి పూలబోకెతో శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు మరియు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజా సేవలో ఆదర్శంగా నిలిచిన భట్టి విక్రమార్క ఆయురారో గ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన మంత్రి తుమ్మల

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

-ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 71




హంస కలం వార్త జూన్ 15

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

హంస కలం వార్త జూన్ 15



ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలిం చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

-కొల్లాపూర్ పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించిన కలెక్టర్

హంస కలం వార్త జూన్ 15





కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఉదయం ఆకస్మికంగా పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ పనుల పురోగతిని సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.పర్యటనలో భాగంగా ముందుగా పట్టణంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత పనుల్లో నిమగ్నమైన పారిశుద్ధ్య కార్మికులతో నేరుగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులు, పని పరిస్థితులు, సంక్షేమ చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, వారికి అవసరమైన భద్రతా పరికరాలు, గ్లోవ్స్, మాస్కులు, గౌన్లు తదితర రక్షణ సామగ్రి అందుబాటులో ఉన్నాయా అని అధికారులను ప్రశ్నించారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది కొరత, పరికరాల లభ్యత వంటి అంశాలపై కార్మికుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, వారి భద్రతకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలో పరిశుభ్రత, పచ్చదనం, వ్యర్థాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నాగమణి, వెంకట లక్ష్మయ్య, మౌనిక, శ్రీనివాస్‌లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉందో, ప్రభుత్వం నుంచి దశలవారీగా విడుదలయ్యే ఆర్థిక సాయం సకాలంలో అందుతోందో లేదో తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల అవుతున్నాయా, ఏవైనా బకాయిలు ఉన్నాయా, నిర్మాణ సామగ్రి సమకూర్చుకోవడంలో ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సహాయం పూర్తిస్థాయిలో అందేలా చూడాలని, పెండింగ్ బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పర్యటనలో భాగంగా కొల్లాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా కలెక్టర్ సందర్శించారు. కాంప్లెక్స్‌లోని దుకాణాల వినియోగం, అద్దె ద్వారా లభిస్తున్న ఆదాయం, నిర్వహణ వ్యవస్థ, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెరిగేలా అందుబాటులో ఉన్న వాణిజ్య స్థలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు

# ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు భట్టి విక్రమార్క మల్లు

-జన్మదిన వేడుకలు

-ఘనంగా నిర్వహణ..

-టి.పి.సి.సి సభ్యులు జేబీ శౌరి

హంస కలం వార్త జూన్ 15




తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు, నిరంతర ప్రజా పోరాట యోధుడు భట్టి విక్రమార్క మల్లు జన్మదినాన్నిపురస్కరించుకొని కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీ.పీ.సీ.సీ సభ్యులు జేబీ శౌరి ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి భట్టి విక్రమార్క కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జేబీ శౌరి గారు మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టి తన కృషి, నిజాయితీ, ప్రజాసేవ పట్ల అంకితభావంతో తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు భట్టి విక్రమార్క అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు.ఖమ్మం జిల్లాలోని గాంధీ భావజాలాన్ని ఆచరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, శాసనసభలో కాంగ్రెస్ పక్ష నేతగా, సీఎల్పీ నాయకుడిగా అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుండేవారని అన్నారు.ప్రత్యేకించి తెలంగాణ రాజకీయ చరిత్రలో మైలురాయిగా నిలిచిన "పీపుల్స్ మార్చ్ పాదయాత్ర" ద్వారా రాష్ట్రంలోని గ్రామాలు, రైతులు, యువత, మహిళలు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడు భట్టి విక్రమార్క అని తెలిపారు. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల బాధలను అర్థం చేసుకొని వారి స్వరాన్ని ప్రభుత్వాలకు వినిపించిన ప్రజా నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.నేడు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం, క్రమశిక్షణ, నిరాడంబర జీవనశైలి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతుకూరి ధర్మారావు, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ ఏలూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి రజాక్, నగర కాంగ్రెస్ కన్వీనర్ ఎండి గౌస్ మోహినుద్దీన్, ఓబీసీ జిల్లా చైర్మన్ అల్లాడి నరసింహారావు, ఎన్ ఎస్ యుఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, సోషల్ మీడియా ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జ్ వీరాపురం రామ్ లక్ష్మణ్, సేవాలాల్ నియోజకవర్గ అధ్యక్షులు పోరేటి నరేష్, మాజీ ఎంపిటిసి కసనబోయిన భద్రం, మాజీ కో ఆప్షన్ నెంబర్ ఆరిఫ్ ఖాన్,యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షుడు ఉస్మాన్ అలీ ఖాన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు లాల్ సింగ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరి రాందాస్, నాయకులు గాండ్ల సురేష్, పెగడ బిక్షపతి, కొమరయ్య, నరసింహారావు, నిరంజన్ రెడ్డి, వాగబోయిన రాము, యువజన నాయకులు నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంస కలం వార్త జూన్ 15



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.చెన్నూర్ మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన కావేరి శోభ తన పేరు ఇందిరమ్మ మొదటి జాబితాలో వచ్చిందని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సెగ్గెం ప్రసాద్ ఎస్.సి.కులానికి చెందిన నిరుపేద అయిన తనకు జీవనాధారంగా ఆటో, రెండు పడక గదుల ఇల్లు అందజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కట్ల పోసక్క, కట్ల పోచం లు గ్రామ శివారులో చేపట్టిన అక్రమ కల్వర్టు నిర్మాణంలో తమ భూమి ఆక్రమణ జరుగుతుందని,ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ కు చెందిన సత్యనారాయణ రావు తనకు జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామంలో గల భూమి గోదావరి నీటిలో మునిగిందని,ఈ విషయమై సమగ్ర విచారణ జరపి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని దేవాపూర్ కు చెందిన కాంపెలి వెంకటేశం తన కుమారుడికి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కళ్యాణి తనకు గృహజ్యోతి,గ్యాస్ రాయితీ పథకాలు వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు.పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని,మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

-రోడ్డు భద్రత,సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహనతో ఉండండి
-విద్యార్థిని విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
-నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

హంస కలం వార్త జూన్ 15

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా నల్గొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) శరత్ చంద్ర పవార్ విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు కీలక సూచనలు చేశారు.విద్యార్థులు ఈ విద్యా సంవత్సరాన్ని ఉత్సాహం, క్రమశిక్షణ,బాధ్యతతో ప్రారంభించి విద్యలో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలు,కళాశాలలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్,నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని,ప్రయాణ సమయంలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నివారించాలని సూచిస్తూ "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని ఎస్పీ పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డులు, ఓటీపీలు,బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.సోషల్ మీడియాలో అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టులు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాలు, పొగాకు, మద్యం వంటి హానికర అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని,తోటి స్నేహితుల ఒత్తిడికి లోను కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బందిని గౌరవి ంచాలని, ఆటపట్టించడం, వివక్ష,అనుచిత ప్రవర్తనకు దూరంగా ఉండాలని అవగాహన కలిగించారు. చదువుతో పాటు వ్యాయామం, వినోదం,తగిన విశ్రాంతితో



సమతుల్య దినచర్యను పాటించాలన్నారు.విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్,100/112 అత్యవసర స్పందన సేవ,1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్,అలాగే 871267 0266 నల్గొండ జిల్లా మాదకద్రవ్యాల నిర్మూలన హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.

# రైతాంగానికి,అన్నదాతలకు సూర్యాపేట జిల్లా పోలీస్ విజ్ఞప్తి

-నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండండి
-విడి,లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దు
-అనుమతులు ఉన్న డీలర్లు,విత్తన దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి
-గ్రామాలలోకి వచ్చి విత్తనాలు అమ్మే దళారుల వద్ద విత్తనాలు కొనవద్దు
-నాణ్యతలేని,శుద్ధిచేయని నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు
-సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ

హంస కలం వార్త జూన్ 15

ప్రస్తుతం రుతుపవనాల రాకతో వర్షాలు,చిరుజల్లులు ప్రారంభమయ్యాయి.అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలోని పత్తి,మిర్చి, వరి సాగు చేస్తున్న రైతులందరికీ పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ కె.నరసింహ రైతన్నలు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.నకిలీ విత్తనాలకు దూరంగా ఉండండి, అనధికారిక,సర్టిఫైడ్ లేని మరియు ప్యాకింగ్ లేని విత్తనాలను కొనకండి. గ్రామాలలోకి వచ్చి దళారుల వద్ద విడి విత్తనాలు కొనవద్దు అన్నారు. ఇవి వాడటం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉంది,అంతేకాకుండా రైతులు పడే శ్రమ వృధా అవుతుంది.విత్తనాలను కేవలం ప్రభుత్వం సూచించిన అధీకృత విత్తన దుకాణాల్లోనే కొనుగోలు చేయండి.విత్తనాలు కొన్నప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి మరియు దానిని భద్రపరుచుకోవాలి. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోతే, విత్తనాలు అమ్మిన వ్యాపారస్తులను ప్రశ్నించడానికి మరియు వ్యవసాయాధికారులను ఆశ్రయించడానికి ఈ రశీదు కీలకం ఉంటుంది.నాణ్యతలేని,శుద్ధిచేయని నకిలీ విత్తనాలు అమ్మవద్దు, అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవు,నకిలీ విత్తనాలను విక్రయించే దళారులు,వ్యాపారులపై విత్తనాల చట్టం మరియు బి.ఎన్.ఎస్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ఆర్గనైజ్డ్ క్రైమ్ కింద కేసులు నమోదు చేసి,వారిని జైలుకు పంపడం జరుగుతుందని



హెచ్చరించారు.నకిలీ విత్తనాల పట్ల పోలీసు శాఖ నిఘా ఉంచాం, విత్తనాలను లూజుగా బ్యాగులలో అమ్ముతున్న వ్యాపారులపై నిఘా పెట్టడం జరిగింది. రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని,ఏదైనా సమస్య తలెత్తినా లేదా నకిలీ విత్తనాలపై సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు డయల్ 100,112 మరియు సూర్యాపేట జిల్లా కంట్రోల్ రూమ్ 8712686026 కు సమాచారం ఇవ్వాలి, వ్యవసాయాధికారులను సంప్రదించాలని అన్నారు.

# జిల్లాలో ఆహార భద్రతపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి

-కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తప్పవు
-ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తప్పనిసరి ఉండాలి
-జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హంస కలం వార్త జూన్ 15

జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ (డీఎల్‌ఏసీ) సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన,జిల్లాలో ఆహార భద్రత చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి 15 రోజులకు ఒకసారి ఆహార భద్రతకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని సూచించిన కలెక్టర్,పాలు, పాల ఉత్పత్తులు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు,సిద్ధం చేసిన ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు.నమూనాల సేకరణను పెంచి నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జాతీయ రహదారి-65 వెంట ఉన్న హోటళ్లు,దాబాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.గతంలో కేసులు నమోదైన నిర్వాహకులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే



సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థుల్లో కూడా ఆహార భద్రతపై అవగాహన కల్పించాలని,పాఠశాలలో ఆహార నిల్వ,పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్క రించాలని పేర్కొన్నారు. జిల్లాలో నిషేధిత గుట్కా,పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ,రవాణా, విక్రయాలపై ఆహార భద్రత,పోలీసు, వైద్యారోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం-2006 ప్రకారం చిన్న,పెద్ద ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్,రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.కల్తీ ఆహారం లేదా నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందితే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ప్రజలు గూగుల్ ప్లే స్టోర్‌లో లభించే ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా లేదా జిల్లా ఆహార భద్రత కార్యాలయం,జిల్లా కలెక్టరేట్, రాష్ట్ర ఆహార భద్రత హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి,ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్,డీఏఓ శ్రీధర్ రెడ్డి,డీఎస్‌ఓ మోహన్ బాబు, డీఎంహెచ్‌వో వెంకటరమణతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన

-ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

హంస కలం వార్త జూన్ 15

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఈ రోజు అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు విద్యా సంబంధిత అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు ఈ సందర్భంగా రెడ్డిగూడెం ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామస్తులతో మాట్లాడారు అనంతరం తిరుమలకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని తోగ్గూడెం, తిరుమలకుంట కాలనీలలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలల వద్ద రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రహరీ గోడలను ప్రారంభించారు. అనంతరం మొద్దులమడ గ్రామంలో ఇటీవల నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.4 లక్షల నిధులతో జీపీఎస్ పాఠశాలలో కల్పించిన మౌలిక వసతులను ప్రారంభించారు. అనంతరం దిబ్బగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దురదపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలలో బాలబాలికల కోసం రూ.4 లక్షల వ్యయంతో విడివిడిగా నిర్మించిన మల్టీ యూనిట్ టాయిలెట్లను ప్రారంభించారు. చివరిగా నారాయణపురం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం విద్యార్థుల



సంక్షేమం కోసం తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ , పీసీసీ జిల్లా సభ్యులు తుమ్మా రాంబాబు , కోలా లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు ఉపసర్ప ంచులు వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల నాయకులు మహిళా నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో కార్మికుల సమీకరణ పెంచి మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
-రైతులకు సాగునీరు అందించే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి..
-ఉపాధి హామీ కూలీలకు ఎండల నుంచి రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి..
-వైరా నియోజకవర్గంలోని ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..



హంస కలం వార్త జూన్ 15

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే సాగునీటి వనరుల అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా చేపట్టి, మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. సోమవారం వైరా నియోజకవర్గ పరిధిలో పర్యటించిన జిల్లా కలెక్టర్, వైరా మండలం సాన్నాల లక్ష్మీపురం గ్రామంతో పాటు కొనిజర్ల మండల కేంద్రంలో కొనసాగుతున్న కేనాల్ లింక్ కాలువ పూడికతీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్ కార్మికులతో మాట్లాడారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. కాలువల పూడికతీత, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు, రైతులకు సాగునీరు అందించే మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల లభ్యతను పెంచి, ఎక్కువ మంది కార్మికులకు పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చూడాలని, కూలీల హాజరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలని, మాస్టర్ రోల్స్‌లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. పాధి హామీ పనుల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని, పనుల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి పనిని ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా ఫోటో క్యాప్చరింగ్ చేసి నమోదు చేయాలని, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవాలని కలెక్టర్ అన్నారు. పనుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకొని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పని స్థలాల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించడంతో పాటు, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల ప్రభావం వల్ల కార్మికులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం గురించి మరింత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మాస్టర్ కార్డులను పరిశీలించిన కలెక్టర్, పని దినాల నమోదు, హాజరు వివరాలు, చెల్లింపుల స్థితిగతులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు మహిళా సంఘ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎంపీడీవోలు పనుల అమలు, పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అధిక సంఖ్యలో కార్మికులను సమీకరించి పనులు నిర్వహిస్తే అదనపు కాంపోనెంట్ నిధులు పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్మికులు చేసిన పనికి సంబంధించిన వేతన వివరాలను అదే రోజున వారికి స్పష్టంగా తెలియజేయాలని, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయ మౌలిక సదుపాయాల బలోపేతంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలలో కొనిజర్ల తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో ఉపేంద్రయ్య, సర్పంచ్ గుదే పుష్పావతి, వైరా తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సక్రు నాయక్, లక్ష్మీపురం సర్పంచ్ నూతి వెంకటేశ్వర్లు,ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## హర్మూజ్ తెరుచుకుంది.. పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గుతాయా?

-మొదటి పేజీ తరువాయి:
ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధిని తెరవనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు గణనీయంగా దిగొచ్చాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు తగ్గుతాయా అనే చర్చ మొదలైంది. ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు. చమురు మార్కెటింగ్ సంస్థలు గతంలో వచ్చిన నష్టాలను భర్తీ చేసుకునే ప్రక్రియలో ఉన్నాయి. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్లో ధరలు కొంతకాలం స్థిరంగా తక్కువ స్థాయిలో కొనసాగితేనే వినియోగదారులకు ప్రయోజనం కనిపించే అవకాశం ఉంది. నిపుణుల అంచనా ప్రకారం ఒకవేళ ధరలు తగ్గించినా లీటర్‌కు రూ. 2 నుంచి రూ. 4 వరకు మాత్రమే దిగొచ్చే అవకాశముంది. ఎల్‌పీజీ సిలిండర్ ధరల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కొన్ని వర్గాలకు సబ్సిడీలు అందిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్, చమురు ధరలు మరింత తగ్గితే ప్రభుత్వంపై సబ్సిడీ భారం తగ్గుతుంది. అప్పుడు ధరల విషయంలో కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నప్పటికీ, అది అందరికీ ఒకేలా వర్తిస్తుందని చెప్పలేం. అయితే హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం భారత్‌కు మాత్రం సానుకూల పరిణామమే. ఎందుకంటే దేశం అవసరమైన చమురులో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. చమురు ధరలు నియంత్రణలో ఉంటే దిగుమతి వ్యయం తగ్గడంతో పాటు ద్రవ్యోల్బణంపై కూడా ఒత్తిడి తగ్గుతుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊరట లభించే అవకాశం ఉంది.

## ఐదు సంస్థలుగా వేదాంతా-కొత్త కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్లో అరంగేట్రం




గనులు, లోహాలు, ఇంధన రంగ సంస్థ అయిన ప్రముఖ వేదాంత గ్రూప్ డీమర్జర్ ప్రక్రియ పూర్తయింది. విభజిత నాలుగు కొత్త కంపెనీలు సోమవారం బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ ప్రారంభించాయి. దీంతో వేదాంత గ్రూప్‌నకు చెందిన మొత్తం ఐదు కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్‌కు అందుబాటులోకి వచ్చాయివేదాంతా లిమిటెడ్‌తో పాటు వేదాంతా అల్యూమినియం మెటల్, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ షేర్లు సోమవారం అరంగేట్రం చేశాయి. వేదాంతా అల్యూమినియం మెటల్ బీఎస్‌ఈలో రూ. 527 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించి రూ. 538 వద్ద గరిష్ఠాన్ని తాకింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.95 లక్షల కోట్లకు చేరింది. ఇక, వేదాంతా పవర్ బీఎస్‌ఈలో రూ. 41.30 వద్ద లిస్టయింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ. 16,736 కోట్లకు చేరింది. అలాగే వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్ రూ. 14,487 కోట్ల మార్కెట్ విలువను, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ రూ. 8231 కోట్ల మార్కెట్ విలువను చేరాయి. ఇక, డీమర్జర్ పథకం ప్రకారం రికార్డు తేదీ అయిన మే1 నాటికి వేదాంతా మిటెడ్ షేర్లు కలిగి ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీల్లో ఒక్కో షేర్ కేటాయించారు. అంటే ఒక వేదాంతా షేర్‌కు అదనంగా నాలుగు కొత్త కంపెనీల్లో ఒక్కో షేర్ చొప్పున లభించింది.

### సరికొత్త రికార్డుల వైపు స్టాక్ మార్కెట్లు
## సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు జంప్



ముంబై, జూన్ 15: అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం ప్రపంచ ఆర్థిక రంగానికి సరికొత్త జవసత్వాలను అందించింది. హోర్ముజ్ జలసంధి పునరుద్ధరణ వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు 2 నెలల కనిష్టానికి (బ్యారెల్‌కు 80 డాలర్ల సమీపంలోకి) పడిపోవడంతో భారతీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ సోమవారం సరికొత్త రికార్డుల వైపు దూసుకెళ్లాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,128.66 పాయింట్లు (1.49శాతం) లాభపడి 76,656.61 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 350.40 పాయింట్లు (1.48శాం) పెరిగి 23,973.30 పాయింట్ల వద్ద బలంగా కొనసాగుతోంది.భారత మార్కెట్లో ట్రేడర్లు, ఇన్వెస్టర్లలో భయాలను సూచించే 'ఇండియా విక్స్'ఒక్కసారిగా 8.6% పడిపోయి 13.56 స్థాయికి చేరింది.ఇది మార్కెట్లో అస్థిరత తగ్గి, బయింగ్ సెంటిమెంట్ బలంగా పెరిగిందనడానికి స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది.

**-స్మాల్, మిడ్-క్యాప్స్ హుషార్.. అన్ని రంగాలూద గ్రీన్!**

గత వారం చివరి సెషన్‌లోనే నిఫ్టీ 500 సూచీ 2.19 శాతం పెరగ్గా, నేటి ట్రేడింగ్‌లోనూ ఆ జోరు స్పష్టంగా కనిపిస్తోంది. మార్కెట్లో బ్రాడర్ ఇండెక్స్‌లైన నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీలు చెరో 1.3శాతం లాభంతో ట్రేడవుతున్నాయి. మార్కెట్లోని అన్ని రంగాలు లాభాల పచ్చదనంతోనే ట్రేడింగ్‌ను ప్రారంభించాయి.

## దోహా డైమండ్ లీగ్: కమ్‌బ్యాక్ ఇవ్వనున్న నీరజ్ చోప్రా

ఇంటర్నెట్ డెస్క్:
భారత జావెలిన్ త్రో స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. వెన్ను గాయం కారణంగా చాలా కాలం పాటు ఆటకు దూరంగా ఉన్న నీరజ్.. జూన్ 19న ప్రారంభం కానున్న దోహా డైమండ్ లీగ్ 2026లో పాల్గొననున్నాడు. ఈ విషయాన్ని నీరజ్‌కు సంబంధించిన మేనేజ్‌మెంట్ సంస్థ ప్రకటించింది. '2026లో తొలి త్రో దోహాలోనే.. నీరజ్ చోప్రా జూన్ 19న తిరిగి బరిలోకి దిగనున్నాడు' అని పేర్కొంది. దోహా డైమండ్ లీగ్‌కు సంబంధించి జూన్ 12న ప్రకటించిన తుది జాబితాలో నీరజ్ చోప్రా పేరు లేకపోవడం గమనార్హం. అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో చివరి నిమిషంలో అతడిని పోటీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దోహా వేదిక నీరజ్‌కు ప్రత్యేకమైనది. గతేడాది ఇదే మైదానంలో అతడు తన కెరీర్‌లో తొలిసారి 90 మీటర్ల మార్కును అధిగమించి చరిత్ర సృష్టించాడు. 90.23 మీటర్ల త్రో నమోదు చేసినప్పటికీ, జర్మనీకి చెందిన జులియన్ వెబర్ 91.06 మీటర్ల త్రోతో అగ్రస్థానంలో నిలవడంతో నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక ఇటీవల ప్రకటించిన భారత అథ్లెటిక్స్ జట్టులో కూడా నీరజ్‌కు చోటు దక్కింది. అయితే అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిర్దేశించిన 82.61 మీటర్ల అర్హత ప్రమాణాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ అర్హత సాధిస్తే రాబోయే కామన్వెల్త్ క్రీడల్లోనూ అతడు భారత్ తరపున బరిలోకి దిగనున్నాడు. కాగా, దోహా డైమండ్ లీగ్ 2026 సీజన్ ఈ ఏడాది మే 8న ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా పోటీలు వాయిదా పడ్డాయి. దీంతో జూన్ 19న ఈ సీజన్ ప్రారంభం కానుంది.




# స్పోర్ట్స్

## ముక్కోణపు సిరీస్: సూపర్ ఓవర్‌లో శ్రీలంక-ఎ విజయం




ఇంటర్నెట్ డెస్క్:
ముక్కోణపు సిరీస్‌లో భాగంగా దంబుల్లా వేదికగా భారత్-ఎపై జరిగిన వన్డే మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. సూపర్ ఓవర్‌లో భారత్-ఎపై శ్రీలంక-ఎ విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య మ్యాచ్ ఫలితం టై కావడంతో సూపర్ ఓవర్ పెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 16/0 పరుగులు చేసింది. సహన్ అరాచ్చిగే (6), అవిష్క ఫెర్నాండో (9) రన్స్ చేశారు. అనంతరం ఛేదనకు దిగిన భారత్ 9/0 పరుగులు మాత్రమే చేసింది. సూర్యాంశ్ (3), వైభవ్ సూర్యవంశీ (6) రన్స్ చేశారు.తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్-ఎ జట్టు 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. సూర్యాంశ్(72), విప్రాజ్ నిగమ్(51) హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ(21) మరోసారి విఫలమయ్యాడు. మిగతా బ్యాటర్లంతా నిరాశపర్చారు. శ్రీలంక బౌలర్లలో షిరాజ్ 3, విజయకాంత్ 3, అరాచ్చిగే, మధులాన్, సహన్ తలొక వికెట్ పడగొట్టారు. విప్రాజ్ నిగమ్ చేసిన తప్పిదం వల్ల భారత్-ఎ టీమ్‌కు 10 పరుగుల పెనాల్టీని అంపైర్లు విధించారు. దీంతో శ్రీలంక-ఎ 10/0తో ఛేదన ప్రారంభించింది. 266 పరుగుల లక్ష్య ఛేదనలో శ్రీలంక.. 50 ఓవర్లలో 265 పరుగులు చేసి భారత్ స్కోరును సమం చేసింది. శ్రీలంక బ్యాటర్ సదీరా సమరవిక్రమ(93) చెలరేగి ఆడాడు. తృటిలో సెంచరీని మిస్ చేసుకున్నాడు. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ నిర్వహించారు. అందులో శ్రీలంక-ఎ విజయం సాధించింది.

## డిప్రెషన్‌లోకి వెళ్లా.. క్రికెట్‌ను వదిలేయాలనుకున్నా: శ్రేయాంక పాటిల్

ఇంటర్నెట్ డెస్క్:
భారత మహిళల జట్టు స్టార్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన దశ గురించి తాజాగా పంచుకుంది. గాయాల కారణంగా ఆమె చాలా కాలం పాటు ఆటకు దూరమైన సంగతి తెలిసిందే. బొటన వేలు ఫ్రాక్చర్, మణికట్టు గాయం కారణంగా వన్డే ప్రపంచ కప్ 2025, ఐపీఎల్ 2025లో చోటు కోల్పోయింది. ఆ సమయంలో డిప్రెషన్‌కు గురయ్యానని శ్రేయాంక వెల్లడించింది. ఆదివారం భారత్-పాక్ మ్యాచ్ అనంతరం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు తెలిపింది.చాలాకాలం పాటు నన్ను గాయాలు తీవ్రంగా వేధించాయి. ఆ సమయంలో డిప్రెషన్‌లోకి వెళ్లాను. ఒకానొక దశలో క్రికెట్‌ను వదిలేయాలని అనుకున్నాను. కానీ నా మనసులో ఒక స్వరం ఎప్పుడూ వినిపించేది. 'నువ్వు ఈ ఆటను ప్రేమిస్తున్నావు.. ఆ ప్రేమ కోసమే ఇక్కడ ఉన్నావు.. నువ్వు కచ్చితంగా క్రికెట్ ఆడి తీరాలి' అని ప్రతిక్షణం నా మనసు నాకు గుర్తు చేసేది. నేను ఇష్టపడే పనిని ఎలా వదిలేస్తాను? అందుకే ధైర్యంగా నిలబడ్డాను. నాన్న ఎప్పుడూ నాతో




మాట్లాడేవారు. కుటుంబ సభ్యులు అండగా నిలిచారు. నా చుట్టూ ఉన్న వాళ్లంతా నన్ను ప్రోత్సహించారు. ఆ మద్దతే నన్ను ముందుకు నడిపించింది. ఇప్పుడు మళ్లీ మైదానంలోకి రావడం చాలా ఆనందంగా ఉంది' అని శ్రేయాంక పేర్కొంది.

**-బుమ్రా సలహాలు పని చేశాయి..**

భారత స్టార్ పేసర్ బుమ్రా తనకు ఇచ్చిన సలహాలను కూడా శ్రేయాంక గుర్తు చేసుకుంది. గాయాల నుంచి కోలుకునే సమయంలో బుమ్రాతో అనేక విషయాలు చర్చించానని తెలిపింది. 'ఒత్తిడిలో బౌలింగ్ ఎలా చేయాలి? యార్కర్లు ఎలా ప్రాక్టీస్ చేయాలి? వంటి ఎన్నో ప్రశ్నలు బుమ్రాను అడిగాను. ఆయన ఫాస్ట్ బౌలర్.. నేను స్పిన్నర్.. అయినప్పటికీ డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసే విషయంలో చాలా సూచనలు ఇచ్చారు. 'క్రికెట్‌లో గాయాలు సహజం.. ప్రతి ప్లేయర్ ఇలాంటి దశను ఎదుర్కొంటాడు. నువ్వు చిన్న వయసులోనే ఈ అనుభవం పొందుతున్నావు. దానితో పోరాడకు.. దానిని అర్థం చేసుకో' అని చెప్పారు. మొదట్లో రెండు మూడు నెలలు ఎవరితోనూ మాట్లాడకుండా గదిలోనే ఉండిపోయాను. అది నా స్వభావం కాదు. నేను సాధారణంగా చాలా ఉత్సాహంగా ఉంటాను. కానీ గాయాలు నన్ను ఒంటరిదానిగా మార్చాయి. ఆ సమయంలోనే రియాన్ పరాగ్, మయాంక్ యాదవ్, అమన్‌జ్యోత్ కౌర్ నాకు ధైర్యం చెప్పారు. ఆ తర్వాత నేను ఒంటరిగా లేనని అర్థమైంది' అని శ్రేయాంక వెల్లడించింది.

## టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య



టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య చేసుకున్నది. కుమ్‌కుమ్ భాగ్య సీరియల్‌లో ఆమె కీలక పాత్ర పోషించింది. ఆమె వయసు 22 ఏళ్లు. కుమ్‌కుమ్ భాగ్య టీవీ షోతో ఆమె పాపులర్ నటిగా మరింది. చావా చిత్రంలో కూడా ఆమె నటించింది. సంచితా ఆత్మహత్యతో ఆమె అభిమానులు షాక్‌లోకి వెళ్లారు. ఆత్మహత్య చేసుకోవడానికి కొన్ని గంటల ముందు ఆమె తన సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు షేర్ చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. ముంబైలోని నలసోపోరా ప్రాంతంలో తన పేరెంట్స్, సోదరితో కలిసి ఉంటోంది. ఆత్మహత్య ఘటన జరిగిన సమయంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏ కారణం చేత ఆమె ఆత్మహత్యకు పాల్పడిందో ఇంకా స్పష్టంగా తెలియదు. రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు నటి సంచితా ఉరి వేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య చేసుకున్నది. కుమ్‌కుమ్ భాగ్య సీరియల్‌లో ఆమె కీలక పాత్ర పోషించింది. ఆమె వయసు 22 ఏళ్లు. కుమ్‌కుమ్ భాగ్య టీవీ షోతో ఆమె పాపులర్ నటిగా మారింది. చావా చిత్రంలో కూడా ఆమె నటించింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా.. మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. యాక్సిడెంటల్ డెత్ రిపోర్టును రిజిస్టర్ చేశారు.

# వెంకటేష్-కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్‌కి డిఫరెంట్ టైటిల్

### - ట్రైలర్‌పై అనిల్ రావిపూడి ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆయన, ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కథలతో దాదాపు 100 శాతం విజయాల రికార్డును కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఫ్2', 'ఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆయన, ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కథలతో దాదాపు 100 శాతం విజయాల రికార్డును కొనసాగిస్తున్నారు. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగ్ గీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్



ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు. సాధారణంగా మేము ట్రైలర్లు, ప్రమోషన్లతో సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి చాలా కష్టపడతాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేసి విజయం సాధించారు. ఆ ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఇకపై నా సినిమాలకు కూడా ట్రైలర్లు కట్ చేయను అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

# సినిమాలు మానేసి హిమాలయాలకు వెళ్లిపోదాం అనుకున్నా

### నివేదా పేతురాజ్ ఎమోషనల్ కామెంట్స్



తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ నివేదా పేతురాజ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇటీవల జరిగిన 'సింగ్ గీతం' సక్సెస్ మీట్‌లో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలం గురించి భావోద్వేగంగా మాట్లాడారు. 'సింగ్ గీతం' సక్సెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. 2023లో నేను సినిమాలు పూర్తిగా మానేయాలని అనుకున్నాను. నా జీవితం తప్పుడు దారుల్లో వెళ్తోందని, కొన్ని తప్పు నిర్ణయాలు తీసుకున్నానని అప్పట్లో అనిపించింది. ఆ సమయంలో నేను చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నాను అని వెల్లడించారు. కానీ ఇప్పుడు 'సింగ్ గీతం' సినిమాతో మళ్లీ జీవితంలో సరైన దారిలోకి వచ్చాను. ఈ సినిమా నాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది. నాగ్ అశ్విన్ లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. బహుశా హిమాలయాల్లో ధ్యానం చేసుకుంటూ ఉండేదాన్ని. ఈ సినిమా మంచి ఫలితం ఇస్తుందని నమ్మాను. సినిమా చూసిన తర్వాత నేను భావోద్వేగానికి లోనై ఏడ్చాను అని చెప్పారు. నివేదా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ముఖ్యంగా తప్పు నిర్ణయాలు తీసుకున్నాను , "సినిమాలు మానేద్దాం అనుకున్నాను", "హిమాలయాలకు వెళ్లిపోదాం అనిపించింది" వంటి మాటలు ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాల గురించేనా అనే సందేహాలను అభిమానుల్లో రేకెత్తిస్తున్నాయి. తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ నివేదా పేతురాజ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇటీవల జరిగిన 'సింగ్ గీతం' సక్సెస్ మీట్‌లో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలం గురించి భావోద్వేగంగా మాట్లాడారు. కొంతమంది నెటిజన్లు ఆమె విఫలమైన రిలేషన్‌షిప్‌ను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు మాత్రం జీవితంలో ఎదురైన ఒత్తిళ్లు, కెరీర్ పరమైన నిరాశల గురించే మాట్లాడి ఉండొచ్చని చెబుతున్నారు. అయితే ఈ విషయంపై నివేదా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.ఏదేమైనా, ఒక దశలో సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ సినిమాల్లో చురుకుగా కనిపించేందుకు సిద్ధమవుతుండటం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. 'సింగ్ గీతం'తో ఆమెకు కొత్త ఆరంభం లభించిందని, ఇకపై మరిన్ని మంచి పాత్రల్లో ఆమెను చూడాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నాగార్జునతో అనిల్ రావిపూడి సినిమా ఫిక్స్



టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు సిద్ధమవుతున్నాడా? తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తే అక్కినేని నాగార్జునతో సినిమా దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనిల్ రావిపూడి తన కెరీర్‌లో ఇప్పటికే పలువురు అగ్ర హీరోలతో కలిసి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించారు. ముఖ్యంగా సీనియర్ స్టార్ హీరోలైన మెగాస్టార్ చిరంజీవి, నటసింహం బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్‌లతో సినిమాలు చేసి విజయాలు సాధించారు. దీంతో టాలీవుడ్‌లో ఒకే తరం నలుగురు అగ్ర హీరోలతో పనిచేసే అరుదైన అవకాశానికి ఆయన మరింత చేరువయ్యారు. గతంలో నాగార్జున-అనిల్ రావిపూడి కాంబినేషన్‌పై అనేక వార్తలు వచ్చినప్పటికీ అవి ప్రచారాలుగానే మిగిలిపోయాయి. అయితే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ కాంబినేషన్‌ను వార్తల్లోకి తెచ్చాయి. ఒక షో ప్రమోషన్స్ సందర్భంగా సీనియర్ నటి రాధ మాట్లాడుతూ,నేను చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో సినిమాలు చేశాను అని చెప్పగా, బాలకృష్ణ, వెంకటేష్‌లతో తాను చేసిన సినిమాల పేర్లను ప్రస్తావించారు. అనంతరం "నాగార్జున గారితో మనం త్వరలో తీయబోతున్నాం" అని సరదాగా వ్యాఖ్యానించారు. మరోవైపు నాగార్జున కూడా తన ప్రతిష్ఠాత్మక 100వ సినిమాను ఓ ప్రముఖ తమిళ దర్శకుడితో చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయిన పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

## స్టేజ్‌పై అందరి ముందు విజయ్ మీసం మెలేసిన రష్మిక



క్యూట్ ఫొటోలు వైరల్ టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మరోసారి తన సేవా కార్యక్రమాలతో అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల తన పెళ్లి రిసెప్షన్ సందర్భంగా సొంత గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తానని ప్రకటించిన విజయ్.. ఇప్పుడు ఆ మాటను కార్యరూపంలో చూపించారు. ఇక విజయ్ దేవరకొండ తన భార్య రష్మికతో కలిసి స్వగ్రామమైన తుమ్మన్‌పేటను సందర్శించారు. టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మరోసారి తన సేవా కార్యక్రమాలతో అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల తన పెళ్లి రిసెప్షన్ సందర్భంగా సొంత గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తానని ప్రకటించిన విజయ్.. ఇప్పుడు ఆ మాటను కార్యరూపంలో చూపించారు. గ్రామస్థుల మధ్య ఎంతో ఆప్యాయంగా గడిపిన ఆయన, 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 9వ, 10వ తరగతి టాపర్ విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449